సాక్షి శ్రీకాకుళం

శుక్రవారం । 12 । ఏప్రిల్ । 2024



వేసవి పంట..

వజ్రపుకొత్తూరు మండలంలో వేసవిలో కొత్త వంగడాలతో సాగు చేస్తున్నారు. దిగుబడులు బాగుంటున్నాయి.

- 8లో



ఆత్మీయంగా..

ఎన్నికల ప్రచారాలు ఆత్మీయంగా సాగుతున్నాయి. నాయకులు జనంతో కలిసిపోతున్నారు.

- 8లో

'ఎన్నికలకు సహకరించండి'

టెక్కలి రూరల్: సార్వత్రిక ఎన్నికలు ప్రశాంతంగా జరిగే విధంగా ప్రజలు సహకరించాలని టెక్కలి సీఐ పి.షైడయ్య కోరారు. గురువారం మండలంలోని లింగాలవలస గ్రామంలో ప్రజలకు ఎన్నికలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ ఎన్నికల్లో ఎలాంటి గొడవలు జరగకుండా తమకు సహకరించాలని, ఎన్నికల సమయంలో గొడవలు పడి కేసుల్లో ముద్దాయిలు కావద్దని సూచించారు.

న్యూస్‌రీల్

యాదవ కులస్తులపై టీడీపీ అభ్యర్థి తండ్రి తిట్ల పురాణం

శ్రీకాకుళం, శ్రీకాకుళం రూరల్: యాదవ సామాజిక వర్గం వారిపై శ్రీకాకుళం టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి గొండు శంకర్ తండ్రి గొండు జగపతి తిట్ల పురాణం అందుకున్నారు. ప్రస్తుతం ఆ ఆడియో రికార్డింగ్ సామాజిక మాధ్యమాల్లో చక్కర్లు కొడుతోంది. తెలుగుదేశం పార్టీకి చెందిన యాదవ కార్యకర్తలపై ఆయన బూతులతో రెచ్చిపోయారు. గొర్రెలు కాసేవారు, గొర్రెపాలు అమ్ముకున్నవారంటూ తిట్లతో రెచ్చిపోయారు. 'జగదీష్, శ్రీనివాస్, శివ మా పార్టీవైపే ఉన్నారు నువ్వు ఏం చేయలేవు. మాట్లాడితే ఎస్‌ఐతో చెప్పి తోలుతీయిస్తాన'ంటూ జగపతి ఫోన్‌లో రెచ్చిపోయారు. ఈ ఆడియో వైరల్ అయ్యాక ఆయన వివరణ ఇచ్చారు. తాను రెండు వారాల కిందట ఫోన్‌లో చనువు కొద్దీ సంభాషించానని, దాన్ని ఎడిట్ చేసి సోషల్ మీడియాలో వైరల్ చేస్తున్నారని ఆయన అన్నారు. తన మాటలకు బాధ పడి ఉంటే యాదవ సోదరులు క్షమించాలని కోరారు.

ఎలుగుల సంచారంపై అప్రమత్తంగా ఉండాలి



చినవంకలో గోడ పత్రికలను అతికిస్తున్న అటవీ శాఖాధికారులు, సిబ్బంది

వజ్రపుకొత్తూరు రూరల్: ఉద్దాన ప్రాంతంలో ఎలుగుల దాడి సంఘటనలు అధికంగా చోటు చేసుకున్న నేపథ్యంలో అటవీ శాఖాధికారులు ప్రజలను అప్రమత్తం చేస్తున్నారు. ఈ మేరకు ఉద్దానం, తీర ప్రాంత గ్రామాలైన డోకులపాడు, చినవంక, బాతుపురం, పల్లిసారథి, అక్కుపల్లి తదితర గ్రామాల్లో గురువారం అటవీశాఖాధికారులు, సిబ్బంది కలిసి గోడ పత్రికలను అతికించారు. ప్రజలు ఎలుగుల సంచారంపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఎలుగులు కనిపిస్తే కవ్వింపు చర్యలకు పాల్పడకూడదని అన్నారు. అలాగే ప్రజలు తోటలకు వెళ్లే సమయంలో ఒంటరిగా వెళ్లరాదని, తమతో పాటు ఆయుధాలను తీసుకువెళ్లాలని అన్నా రు. అలాగే రాత్రి సమయంలో రోడ్లపై తిరగరాదని సూచించారు.

నేడు ఇంటర్ ఫలితాలు వెల్లడి

శ్రీకాకుళం న్యూకాలనీ: ఇంటర్మీడియెట్ పరీక్ష ఫలితాలు నేడు వెల్లడికానున్నాయి. శుక్రవారం ఉదయం 11 గంటలకు ఫలితాలు వెల్లడించేందుకు ఇంటర్ బోర్డు ఏర్పాట్లు చేసింది. రాష్ట్రప్రభుత్వ ఆదేశాల మేరకు ఇంటర్మీడియెట్ బోర్డు చరిత్రలో అనతికాలంలో ఫలితాలను వెల్లడిచేసేలా పకడ్బందీగా ఏర్పాట్లు చేశారు. పరీక్షలు ముగిసిన తర్వాత కేవలం 22 రోజుల్లోనే ఫలితాలను వెల్లడిస్తుండటం గమనార్హం. ఇంటర్మీడియెట్ పరీక్షలు మార్చి 1 నుంచి 20వ తేదీ వరకు జరిగాయి. జవాబుపత్రాల మూల్యాంకన ప్రక్రియ మార్చి 18 నుంచి ఏప్రిల్ 4వ తేదీ వరకు జరిగింది.

45,702 మంది ఎదురుచూపు..

జిల్లాలో ఇంటర్మీడియెట్ ఫలితాల కోసం 45,702 మంది విద్యార్థులు ఎదురుచూస్తున్నారు. ఇందులో జనరల్ విద్యార్థులు 43,071 మంది, ఒకేషనల్ విద్యార్థులు 2,631 మంది ఉన్నారు. వీరిలో ప్రథమ సంవత్సరం 19,937 మంది, ద్వితీయ సంవత్సరం 25,765 మంది విద్యార్థులు ఉన్నారు.

పూలేకు ఘన నివాళి



జ్యోతిరావు పూలే చిత్ర పటానికి పూలమాలలు వేస్తున్న దృశ్యం

శ్రీకాకుళం పాతబస్టాండ్: బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి జ్యోతిరావు పూలే, సావిత్రి బాయి పూలే దంపతులిద్దరూ నిస్వార్థ సేవలందించారని డీఆర్‌ఓ ఎం.గణపతి రావు అన్నారు. జ్యోతిబా పూలే 198వ జయంతి సందర్భంగా గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో మహాత్మా జ్యోతిరావు పూలే చిత్రపటానికి డీఆర్‌ఓ ఎం.గణపతి నివాళులర్పించారు. పూలే ఆశయ సాధనకు కృషి చేయడమే మనం ఆయనకు ఇచ్చే ఘనమైన నివాళి అని అన్నారు. బాల్య వివాహాలు అరికట్టడంలో, మహిళలకు సమాజంలో విద్య అవసరం అని గుర్తించడంలో పూలే దంపతులది నిరుపమాన కృషి అని గుర్తు చేశారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ అధికారి ఇ.అనురాధ మహాత్మా జ్యోతిరావు పూలే జీవిత చరిత్రలో కొన్ని ముఖ్యమైన అంశాలు వివరించారు. కార్యక్రమంలో జిల్లా పౌర సంబంధాల అధికారి కె.బాల మాన్ సింగ్, బీసీ సంక్షేమ వసతి గృహ అధికారుల, సిబ్బంది వివిధ శాఖల అధికారులు సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



హిరమండలం: వైఎస్సార్ సుజలధార లిఫ్ట్ ఇరిగేషన్ ఫిల్టర్లు

పాతపట్నానికి ప్రగతి కట్నం

- అపరిష్కృత సమస్యల పరిష్కారం
- రూ.828.74 కోట్లతో అభివృద్ధి పనులు
- వంశధార నిర్వాసితులకు న్యాయం
- నెరవేరిన తాగునీటి స్వప్నం
- సంక్షేమ పథకాలతో రూ.739.28 కోట్ల లబ్ధి

అంతెత్తున ఉండే కొండలపైకి దారి వచ్చింది. మైదానంలోని పల్లెలకు నీరు వచ్చింది. ప్రాజెక్టుకు భూములిచ్చిన వారికి న్యాయం జరిగింది. పోడు సాగు చేసుకునే గిరిజనానికి సాయం అందింది. పల్లెపల్లెనా శాశ్వత భవనాలు నిర్మితమయ్యాయి. ఎన్నో ఏళ్ల సమస్యలకు శాశ్వత పరిష్కారాలు లభించాయి. వెరసి పాతపట్నంలో కొత్త కళ కనిపిస్తోంది. వైఎస్సార్ సీపీ ప్రభుత్వ ఉదారత, ఎమ్మెల్యే రెడ్డి శాంతి రాజకీయ చతురత కలగలిపి నియోజకవర్గానికి నిధుల జల్లు కురిసింది. అందుకు సాక్షిగా ఇళ్లు, వంతెనలు, రోడ్లు, భవనాలు కనిపిస్తున్నాయి.

ఎల్.ఎన్.పేట:

జిల్లాలోనే కాదు రాష్ట్రంలోనే అత్యల్ప తలసరి ఆదాయాలు గల ప్రాంతాల్లో ఒకటైన పాతపట్నం ఈ ఐదేళ్లలో ఊహించని ప్రగతి చూసింది. 2019–2024 మధ్య కాలంలో పాతపట్నం ఎమ్మెల్యే రెడ్డి శాంతి అనేక అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టారు. ఎన్నో ఏళ్లుగా ఎదురు చూస్తున్న అనేక సమస్యలను గుర్తించి వాటి పరిష్కారం దిశగా అడుగులు వేశారు.



నిధుల వరద

- వంశధార నిర్వాసితులకు రూ.216.71 కోట్ల అదనపు పరిహారం అందజేశారు.
- మెళియాపుట్టి మండలంలో రూ.12 కోట్లు ఖర్చుతో ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూల్ నిర్మాణం.
- ఎల్.ఎన్.పేట మండలం తురకపేట గ్రామం, కొత్తూరు మండలం మెట్టూరు గ్రామంలోనూ కొత్త ప్రభుత్వ ఆస్పత్రులు (పీహెచ్‌సీ)లు ఏర్పాటు చేశారు.
- రూ.8 కోట్లు ఖర్చుతో లక్ష్మీనర్సుపేట, హిరమండలం, చొర్లంగి, బైదలాపురం, గంగువాడ, కురిగాం, కరజాడ, చాపర ప్రభుత్వ ఆస్పత్రుల్లో నాడు–నేడు అభివృద్ధి పనులు.
- పాతపట్నం, కొత్తూరుల్లో ఉన్న ప్రభుత్వ సామాజిక ఆస్పత్రుల (సీహెచ్‌సీ) అభివృద్ధి కోసం రూ.8.50 కోట్లు ఖర్చు చేశారు.
- మెళియాపుట్టిలో రూ.95 లక్షలతో తహసీల్దారు నూతన కార్యాలయ భవనం నిర్మాణం.
- రూ.2 కోట్ల ఖర్చుతో కొత్తూరు, ఎల్.ఎన్.పేట మండలాల్లో బాలికల వసతి గృహం భవనాల నిర్మాణం.
- 3,814 మంది లబ్ధిదారులకు జగనన్న కాలనీ ఇళ్ల స్థలాలు మంజూరు.



- రూ.56 లక్షల ఖర్చుతో రైతుల ప్రయోజనం కోసం కొత్తూరులో అగ్రిల్యాబ్ నిర్మించారు.



పాతపట్నం: మేజర్ పంచాయతీలో ఏర్పాటు చేసిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్

- రూ.6కోట్లు ఖర్చుతో కొత్తూరులో 132/33 కేవీ సామర్థ్యం గల సబ్‌స్టేషన్ నిర్మించారు.
- పాతపట్నం మేజర్ పంచాయతీలో నాణ్యమైన విద్యుత్ అందించేందుకు రూ.93 లక్షలు ఖర్చుతో కొత్తగా 15 విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేశారు.

బడులకు మహర్దశ

- పాతపట్నం మండలంలోని 27 గ్రామాల ప్రజల ప్రయోజనం కోసం కాగువాడ-రొమదల వద్ద మహేంద్రతనయ నదిపై వంతెన నిర్మాణానికి రూ.6.95 కోట్లు, వంతెనకు అనుసంధానంగా రోడ్డు నిర్మాణానికి రూ.2కోట్లు మంజూరు చేశారు.
- ఐదు మండలాల్లో నాడు-నేడు పనులు ద్వారా 246 ప్రభుత్వ పాఠశాలల్లో అభివృద్ధి పనులు చేపట్టారు.
- ఇందుకోసం ప్రభుత్వం రూ.46.38 కోట్లు మంజూరు చేసింది.
- నాడు-నేడు ఫేజ్-1లో 140 పాఠశాలల అభివృద్ధి కోసం రూ.34.36 కోట్లు, ఫేజ్-2లో 106 పాఠశాలల్లో అభివృద్ధి పనులు కోసం రూ.12.02 కోట్లు ఖర్చు చేశారు.



పాతపట్నం:కాగువాడ-రొమదల మధ్య మహేంద్రతనయ నదిపై వంతెన నిర్మాణం



ఎల్.ఎన్.పేట: నాడు-నేడులో అభివృద్ధి చేసిన కేజీబీవీ పాఠశాల



- కొత్తూరు పోలీస్ స్టేషన్ కోసం రూ.2.50 కోట్లు నిధులు మంజూరు చేశారు.

- నియోజకవర్గంలో 91 సచివాలయాలు నిర్మించారు. 91 ఆర్‌బీకే కేంద్రాలతో పాటు వెల్‌నెస్ సెంటర్లు ఏర్పాటు చేశారు.





హిరమండలం: వంశధార రిజర్వాయర్ వద్ద ఉద్దానం తాగునీటి పైపులైన్

- వంశధార నీరు స్థానికంగా ఉపయోగపడేలా రూ.265 కోట్లు ఖర్చుతో ఐదు మండలాలకు తాగునీరు అందించే పనులకు శంకుస్థాపన చేశారు.
- రూ.700 కోట్లు ఖర్చుతో ఉద్దానం ప్రాంతానికి వంశధార తాగునీరు అందించే ప్రాజెక్టు పనులు హిరమండలం వంశధార రిజర్వాయర్ వద్దనే పూర్తి చేశారు.
- రూ.176.35 కోట్లు ఖర్చుతో హిరమండలం మండలంలోని వంశధార రిజర్వాయర్ వద్ద లిఫ్ట్ ఇరిగేషన్ పనులు చేపడుతున్నారు.

అవినీతి లేని పరిపాలన జగనన్నతో సాధ్యం



సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అవినీతి లేని పాలన అందించారు. పాతపట్నం నియోజకవర్గంలో వ్యవసాయం ప్రధాన జీవనాధారం. రైతులకు మేలు జరిగేలా అనేక నిర్ణయాలు తీసుకున్నాం. మహిళా సంక్షేమానికి ప్రాధాన్యత ఇచ్చాం. నాడు–నేడుతో పాఠశాలల్లో 11 రకాల సౌకర్యాలు అందించాం. ఆరోగ్య సురక్ష, ఫ్యామిలీ డాక్టర్ విధానంతో ప్రజల వద్దకు ప్రభుత్వ వైద్యం తీసుకువచ్చాం. దశాబ్దాలుగా రహదారుల్లేని గిరిజన గ్రామాలకు రహదారులు ఏర్పాటు చేశాం. వంశధార తాగునీరు అందించేందుకు రూ.265 కోట్లు, వంశధార నిర్వాసితులకు రూ.216.71 కోట్లు నిధులు మంజూరు చేశారు. ఇలా అందరి సంక్షేమాన్ని కోరే జగనన్నను మళ్లీ ముఖ్యమంత్రిగా ప్రజలు ఎన్నుకోవాలి.

– రెడ్డి శాంతి, ఎమ్మెల్యే, పాతపట్నం

గిరిజన ప్రాంతాలకు రోడ్లు..



ఎల్.ఎన్.పేట: అభివృద్ధి చెందిన అలికాం-బత్తిలి రోడ్డు

నియోజకవర్గంలో రహదారుల అభివృద్ధికి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధిక ప్రాధాన్యత ఇచ్చింది. మెళియాపుట్టి మండలంలోని చందనగిరి, హడ్డివాడ, కేరాసింగి, కేరాసింగి గూడ, ఆంపురం వంటి గిరిశిఖరాల్లో ఉన్న గిరిజన గ్రామాలకు రూ.5.25 కోట్లు ఖర్చుతో రహదారులు వేశారు. రూ.2 కోట్లు ఖర్చుతో ఎల్.ఎన్.పేట మండలం బొర్రంపేట నుంచి హిరమండలం వరకు అలికాం–బత్తిలి (ఏబీ) ప్రధాన రహదారి మరమ్మత్తులు చేపట్టారు. రూ.14.43కోట్లు ఐటీడీఏ నిధులతో నియోజకవర్గంలో 14 రోడ్ల నిర్మాణం, ఆర్అండ్‌బీ రోడ్ల నిర్మాణం కోసం రూ.14.50 కోట్లు, పీఐయు 11 రోడ్ల నిర్మాణం కోసం రూ.27.20 కోట్లు నిధులు ఖర్చు చేశారు.

వైఎస్సార్‌సీపీ హయాంలో లబ్ధి (కొన్ని పథకాలు)

పథకం	లబ్ధిదారులు	లబ్ధిపొందిన మొత్తం
ఆసరా	35,960	రూ.91,84,83,688
అమ్మఒడి	26,936	రూ.394,41,80,633
చేదోడు	1,417	రూ.3,41,33,453
వైఎస్సార్ చేయూత	22,603	రూ.139,13,43,103
పంటల బీమా	14,366	రూ.343,10,38,157
ఈబీసీ నేస్తం	276	రూ.1,05,14,064
జగనన్న తోడు	3,924	రూ.1,02,58,657
జగనన్న వసతి దీవెన	12,581	రూ. 20,93,16,300
జగనన్న విద్యా దీవెన	17,229	రూ.47,85,38,521
కల్యాణమస్తు	220	రూ.3,10,89,683
కాపునేస్తం	554	రూ.2,22,75,100
నేతన్న నేస్తం	207	రూ.1,49,04,000
పింఛన్ కానుక	39,193	రూ.257,14,51,506
రైతు భరోసా	47,313	రూ.139,25,22,313
సున్నావడ్డీ పంట రుణాలు	15,059	రూ.6,00,26,119
వాహన మిత్ర	1,680	రూ.5,36,76,300
వైఎస్సార్ ఆరోగ్య ఆసరా	4,484	రూ.4,16,35,800
ఆరోగ్యశ్రీ	8,116	రూ.28,45,19,856
వైఎస్సార్ బీమా	391	రూ.10,78,94,903
సున్నావడ్డీ (మహిళలు)	54,979	రూ.13,18,86,431

● ఈద్ ముబారక్

సామూహిక ప్రార్థనలు, ఆత్మీయ ఆలింగనాలు, పేదలకు దాన ధర్మాలు..వెరసి ఈద్ ఉల్ ఫిత్ర్‌ను ముస్లిం సోదరులు గురువారం ఘనంగా నిర్వహించారు. ప్రత్యేక ప్రార్థనలు చేశాక ఒకరినొకరు ఆలింగనం చేసుకుని ఈద్ ముబారక్ చెప్పుకున్నారు. రంజాన్ సందర్భంగా కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్, మంత్రి ధర్మాన ప్రసాదరావు, తదితర నేతలు కూడా జిల్లా కేంద్రంలోని జామియా మసీదులో జరిగిన ప్రత్యేక కార్యక్రమానికి హాజరై ప్రార్థనలు చేశారు. – శ్రీకాకుళం కల్చరల్



ప్రత్యేక ప్రార్థనల్లో మంత్రి ధర్మాన ప్రసాదరావు, కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్ తదితరులు



జామియా మసీదులో ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు (ఇన్‌సెట్లో) చిన్నారుల ఆత్మీయ ఆలింగనం


నేడు వైఎస్సార్ సీపీ విస్తృత స్థాయి సమావేశం



శ్రీకాకుళం (పీఎన్ కాలనీ): వైఎస్సార్ సీపీ విస్తృత స్థాయి, ఆత్మీయ సమావేశం శుక్రవారం నిర్వహించనున్నట్లు పార్టీ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్ తెలిపారు. ఈ సమావేశాన్ని శ్రీకాకుళం జిల్లా కేంద్రంలో 80 అడుగుల రోడ్డులో ఆనందమయి ఫంక్షన్ హాల్‌లో ఉద యం 10గంటలకు నిర్వహించనున్నట్లు తెలిపారు. విస్తృత స్థాయి సమావేశానికి ఉత్తరాంధ్ర జిల్లాల కన్వీనర్ వైవీ సుబ్బారెడ్డి, కో–కన్వీనర్ మజ్జి శ్రీనివాసరావు (చిన్న శ్రీను)లు ముఖ్య అతిథులుగా హాజరు కానున్నట్లు తెలిపారు. కార్యక్రమానికి జిల్లా అధ్యక్షుడు కృష్ణదాస్ అధ్యక్షత వహించనున్నారు. కార్యక్రమానికి ఉమ్మడి జిల్లాలో గల మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, కార్పొరేషన్ చైర్మన్లు, నియోజకవర్గ ఇన్‌చార్జ్‌లు, నియోజకవర్గ పరిశీలకులు, పలు కార్పొరేషన్ల డైరెక్టర్లు, మున్సిపల్ చైర్మన్లు, కౌన్సిలర్లు, ఎంపీటీసీలు, జెడ్పీటీసీలు పార్టీ నాయకులంతా హాజరవ్వాలని కృష్ణదాస్ కోరారు.

క్లుప్తంగా

ఇత్తడి పూర్ణఘటం తయారీ


ఇత్తడితో తయారు చేసిన పూర్ణ ఘటం

సారవకోట: మండలంలోని బుడితి గ్రామానికి చెందిన కంచు, ఇత్తడి కార్మికుడు కింతాడ బుజ్జి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పూర్ణ కుంభంలోని పూర్ణఘటంను ఇత్తడితో తయారు చేశారు. మూడు కిలోల బరువు గల ఈ పూర్ణ ఘటంను తయారు చేసేందుకు 10 రోజుల సమయం పట్టిందని, దీని విలువ రూ.25 వేలు ఉంటుందన్నారు. సాధారణ ఎన్నికల అనంతరం నూతనంగా ఏర్పాటు కానున్న ప్రభుత్వానికి సచివాలయంలో ఏర్పాటు చేసేందుకు తన వంతు బహుమతిగా ఇవ్వనున్నట్లు ఆయన తెలిపారు.

ఎన్నికల వేళ ముమ్మర తనిఖీలు


నిమ్మాడ జంక్షన్‌లో వాహన తనిఖీలు

కోటబొమ్మాళి: మండలంలోని జాతీయ రహదారిపై నిమ్మాడ జంక్షన్, జర్జంగి, జోగిపేట జంక్షన్‌లో ముమ్మరంగా వాహన తనిఖీలు చేస్తున్నారు. అనుమానం ఉన్న ప్రతి వాహనాన్ని నిలిపి క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారు. గ్రామీణ ప్రాంతాల రోడ్లపై వెళ్తున్న వాహనాలపై కూడా ప్రత్యేక నిఘా ఉంచినట్లు ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారి గురుప్రసాద్ తెలిపారు.

ఆకట్టుకున్న సీతారాముల కల్యాణ ఘట్టం


ఆకట్టుకుంటున్న సీతారామ కల్యాణ ఘట్టం నాటిక

కాశీబుగ్గ: శ్రీరామనవమి వసంత నవరాత్రి మహోత్సవం సందర్భంగా పలాస రైల్వేస్టేషన్ ఆవరణలో ఉన్న సీతారామాలయంలో ప్రత్యేక కార్యక్రమాలు జరుగుతున్నాయి. గురువారం ఇక్కడ సీతారామ కల్యాణ ఘట్టం అనే నాటికను నటరాజ నాట్యమండలి విద్యార్థులు ప్రదర్శించారు. చిన్నారుల ప్రదర్శన అందరినీ ఆకట్టుకుంది.

సాంకేతిక అంశాల్లో పట్టు అవసరం


ఆర్‌జీయూకేటీలో నిర్వహిస్తున్న వర్క్‌షాపు

ఎచ్చెర్ల క్యాంపస్: విద్యార్థులకు సాంకేతిక అంశాల్లో పట్టు అవసరమని శ్రీకాకుళం రాజీవ్ గాంధీ వైజ్ఞానిక సాంకేతిక విశ్వవిద్యాలయం ఎస్ఎంపురం క్యాంపస్ ప్రొఫెసర్ కేవీజీడీ బాలాజీ అన్నారు. క్యాంపస్‌లో శుక్రవారం నుంచి మూడు రోజుల పాటు టెక్నివెర్స్ టెక్నికల్ ఫెస్ట్ నిర్వహించనున్నారు. క్యాంపస్‌లో గురువారం త్రీడీ ప్రింటింగ్‌పై మెకానికల్, ట్రిపుల్‌ఈ, ఈసీఈ, బ్రాంచ్‌ల ఆధ్వర్యంలో ఒక్క రోజు వర్క్‌షాపు నిర్వహించారు. ఫెస్ట్‌లో మూడు రోజుల పాటు అనేక సాంకేతిక అంశాలపై దృష్టి పెట్టనున్నట్లు వివరించారు. పలు కళాశాలల నుంచి ఇంజినీరింగ్ విద్యార్థులు హాజరుకానున్నారని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఓఎస్‌డీ ఎల్.సుధాకర్‌బాబు, పరిపాలన అధికారి మునిరామకృష్ణ, డీన్ మోహన్ తదితరులు పాల్గొన్నారు.

పెట్రోల్ పోసుకుని వ్యక్తి ఆత్మహత్యాయత్నం

సారవకోట: జలుమూరు మండలం లింగాలపాడుకు చెందిన పంగ సింహాచలం బుధవారం రాత్రి ఆత్మహత్య చేసుకోవడానికి ప్రయత్నించారు. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. జలుమూరు మండలం లింగాలపాడుకు చెందిన పంగ సింహాచలంకు సారవకోట మండలం బద్రి గ్రామానికి చెందిన రుక్మిణితో 20 ఏళ్ల కిందట వివాహం జరిగింది. భార్యాభర్తల మధ్య మనస్పర్థల కారణంగా రుక్మిణి రెండేళ్లుగా తన కన్నవారింటిలో ఉంటున్నారు. ఈ నెల 9న సింహాచలం బద్రి గ్రామానికి వచ్చి తనతో కాపురానికి రావాలని రుక్మిణిని కోరారు. ఆమె దానికి అంగీకరించకపోవడంతో బుధవారం రాత్రి శరీరంపై పెట్రోల్ పోసుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. కాలిపోతున్న సింహాచలంను గమనించిన స్థానికులు తొలుత బుడితి సీహెచ్‌సీ తీసుకెళ్లి అక్కడి నుంచి శ్రీకాకుళం సర్వజన ఆస్పత్రికి తీసుకెళ్లారు. పరిస్థితి విషమంగా ఉండడంతో విశాఖపట్నం కేజీహెచ్‌కు తరలించారు. ఆస్పత్రి వర్గాల నుంచి వచ్చిన సమాచారం మేరకు స్థానిక పోలీసులు స్టేట్‌మెంట్ రికార్డు చేశారు.


ఆమదాలవలస: మెట్టక్కివలసలో ఓటు వేయాలని కోరుతున్న స్పీకర్ తమ్మినేని సీతారాం


శ్రీకాకుళం రూరల్: ఎన్నికల ప్రచారంలో మంత్రి ధర్మాన ప్రసాదరావు


కాశీబుగ్గ: పార్టీ జెండాలతో ఊరేగుతున్న దివ్యాంగుడిని అభినందిస్తున్న డాక్టర్ సీదిరి అప్పలరాజు


సారవకోట: మూగుపురంలో ప్రచార వాహనంపై ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్


సంతబొమ్మాళి: కొల్లిపాడులో చిన్నారులతో కలిసి సెల్ఫీ తీసుకుంటున్న ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్

ఆత్మీయంగా..

అభిమానులకు అభినందనలు, కార్యకర్తలతో సెల్ఫీలు, ప్రజలతో మాటామంతీలతో ఎన్నికల ప్రచారాలు ఉల్లాసంగా సాగుతున్నాయి. నాయకులు కార్యకర్తలతో కలిసి ఇంటింటికీ తిరుగుతున్నారు. కనిపించిన వారందరినీ ఆప్యాయంగా పలకరిస్తూ ఓటు అభ్యర్థిస్తున్నారు.


పాతపట్నం: తామరలో వృద్ధులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రెడ్డి శాంతి


కవిటిలో దుకాణదారుడితో ఆప్యాయంగా మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ అభ్యర్థి పిరియా విజయ


ఎచ్చెర్ల క్యాంపస్: పార్టీ గుర్తు చూపిస్తున్న ఎచ్చెర్ల ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్

‘ప్రేమించి మోసం చేసిన ఆర్మీ జవానుపై చర్యలు తీసుకోవాలి’

పలాస: అమ్మాయిని ప్రేమించి మోసం చేసిన ఆర్మీ జవానుపై తగిన చర్యలు తీసుకోవాలని వివిధ ప్రజాసంఘాలకు చెందిన నాయకులు డిమాండ్ చేశారు. పలాస మండలం గురుదాసుపురం పంచాయతీ జినగోలూరు గ్రామానికి చెందిన యువతి మద్దిల వాణిని గురుదాసుపురం గ్రామానికి చెందిన ఆర్మీ జవాను సాౖర ప్రశాంత్ గత రెండేళ్ల నుంచి ప్రేమించాడు. పెళ్లి చేసుకుంటానని చెప్పి మరో అమ్మాయిని పెళ్లి చేసుకోవడానికి ప్రయత్నం చేస్తున్నాడు. దీంతో వాణి తనకు న్యాయం చేయాలని పోరాటం చేస్తున్నారు. ఇంటిలోనే నిద్రాహారాలు మాని మౌన పోరాటం చేస్తున్నారు. దీంతో ఆమెకు సంఘీభావం తెలుపుతూ అనేక మంది మహిళా సంఘాల నాయకులతో పాటు వివిధ ప్రజాసంఘాల నాయకులు గురువారం ఆమెను పరామర్శించారు. ఆమెకు న్యాయం జరిగే వరకు ఈ పోరాటం మరింత ఉధృతం చేయాలని ప్రజాసంఘాలు పిలుపునిచ్చాయి. కార్యక్రమంలో వామపక్ష నాయకులు చాపర వేణుగోపాలరావు, మద్దిల రామారావు, తామాడ సన్యాసిరావు, ఎన్.గణపతి, పి.దానేసు, దాసరి శ్రీరాములు, తెప్పల డిల్లీరావు, పోలారావు, ఎం. గంగయ్య, బొడ్డు సుధాకర్ పాల్గొన్నారు.


వాణికి మద్దతు తెలుపుతున్న ప్రజాసంఘాల నాయకులు

పోరాట యోధుడు పైలాకు నివాళి

పలాస: పలాస మండలం బొడ్డపాడు అమరవీరుల స్మారక మందిరం వద్ద గురువారం సిక్కోలు గిరిజన రైతాంగ సాయుధ పోరాట యోధుడు పైలా వాసుదేవరావుకు సి.పి.ఐ.ఎం.ఎల్ న్యూడెమొక్రసీ నాయకులు కార్యకర్తలు ఘనంగా నివాళులర్పించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి రెండు నిమిషాలు మౌనం పాటించారు. అనంతరం సిక్కోలు అమరవీరులకు పేరు పేరునా జోహార్లు సమర్పించారు. పలువురు వక్తలు మాట్లాడుతూ ఆయన విప్లవోద్యమంలో పాల్గొని ప్రజలకు చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో వివిధ ప్రజాసంఘాల నాయకులు కె.హేమక్క, పుణ్యవతి, గీత, పోతనపల్లి కుసుమ, గొరకల బాలకృష్ణ, రాపాక మాధవరావు, గర్తం కామేశ్వరరావు, గోపి, పోతనపల్లి మల్లేశ్వరరావు, రెయ్యి సింహాద్రి, భాస్కరరావు, జి.అప్పయ్య తదితరులు పాల్గొన్నారు.


పైలా వాసుదేవరావుకు నివాళులర్పిస్తున్న వివిధ ప్రజాసంఘాల నాయకులు

మంత్రి ధర్మాన సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరికలు


మంత్రి ధర్మాన సమక్షంలో పార్టీలోకి చేరిన వారు

శ్రీకాకుళం రూరల్: మండల పరిధిలోని సింగుపురం పంచాయతీ పల్లివలస గ్రామానికి చెందిన పలువురు నాయకులు ఎంపీటీసీ బగ్గు అప్పారావు ఆధ్వర్యంలో, మంత్రి ధర్మాన ప్రసాదరావు సమక్షంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలోకి చేరారు. గురువారం స్థానిక క్యాంప్ కార్యాలయంలో వీరికి మంత్రి పార్టీ కండువాలు వేసి ఆహ్వానించారు. అందరూ కలిసికట్టుగా పనిచేసి ఈ సారి కూడా భారీ మెజారిటీతో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీని గెలిపించాలన్నారు.

టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలోకి..

ఆమదాలవలస: మెట్టక్కివలస హడ్కో కాలనీకి చెందిన 15 యాదవ కుటుంబాలు టీడీపీని వీడి వైఎస్సార్‌సీపీలోకి వచ్చాయి. పార్టీలో చేరిన వారికి స్పీకర్ తమ్మినేని సీతారాం పార్టీ కండువాలు వేసి గురువారం ఆహ్వానించారు. కార్యక్రమంలో పార్టీ మున్సిపల్ మాజీ ఫ్లోర్ లీడర్ బొడ్డేపల్లి రమేష్‌కుమార్, పార్టీ నాయకులు ముద్దాడ సంతోష్‌కుమార్, జగదీష్ తదితరులు పాల్గొన్నారు.


వైఎస్సార్‌సీపీలో చేరిన సింగుపురం సర్పంచ్ గుండ ఆదిత్యనాయుడు, తదితరులు


ఆమదాలవలస: పార్టీలో చేరిన వారికి పార్టీ కండువా వేసి ఆహ్వానిస్తున్న స్పీకర్ తమ్మినేని సీతారాం

‘డేటాసైన్స్‌పై అవగాహన అవసరం’

శ్రీకాకుళం న్యూకాలనీ: ప్రస్తుత పోటీ ప్రపంచానికి తగినట్టుగా విద్యార్థులు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, రోబోటిక్స్‌తోపాటు డేటాసైన్స్‌పై పూర్తిస్థాయిలో అవగాహన పెంచుకోవాలని జీఎంఆర్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ కంప్యూటర్స్ విభాగాధిపతి ప్రొఫెసర్ డాక్టర్ ఎ.వెంకటరమణ పిలుపునిచ్చారు. శ్రీకాకుళం నగరంలోని ఎల్ఐసీ కార్యాలయం సమీపంలో ఉన్న కాకినాడ ఆదిత్య మహిళా డిగ్రీ కళాశాలలో బ్యాచిలర్ ఆఫ్ సైన్స్ విభాగం ఆధ్వర్యంలో గురువారం ‘ఆక్షి టూకే24’ పేరిట కంప్యూటర్ ఇంటర్నల్ ఫెస్ట్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రొఫెసర్ వెంకటరమణ మాట్లాడుతు కంప్యూటర్ సైన్స్ అతివేగంగా అభివృద్ధి చెందుతున్న రంగమని, ప్రతి రోజు సరికొత్త ఆవిష్కరణలు జరుగుతున్నాయని విద్యార్థులకు గుర్తుచేశారు. ఫెస్ట్‌లో భాగంగా వివిధ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కళాశాల ప్రిన్సిపాల్ కె.శివంకర్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో డైరెక్టర్ బీఎస్ చక్రవర్తి, కంప్యూటర్స్ హెచ్‌ఓడీ ఎల్.ప్రసాదరావు, ఇ.రామ్‌కుమార్, ఎస్.హరిమానస, లలితరెడ్డి, ఎస్.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.


ప్రొఫెసర్ వెంకటరమణను సత్కరించి, జ్ఞాపికలను అందజేస్తున్న కళాశాల ప్రతినిధులు

ఓటు హక్కుపై అవగాహన


హిరమండలం జన్నాడ గూడలో ఓటు హక్కుపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

హిరమండలం: మండలంలోని జొన్నాడగూడ, పాలంగూడ, ఎగువగూడ, పెద్దగూడ, గేసరిగూడ గిరిజన గ్రామాల్లో వెలుగు సంస్థ ఆధ్వర్యంలో సంస్థ కోఆర్డినేటర్ పాలక నాగేశ్వరరావు గురువారం ఓటు హక్కుపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికలు–ఓటరు ప్రాధాన్యత అంశంపై వివరించారు. అలాగే ఓటు నమోదు, ఓటు హక్కు వినియోగంపై చైతన్యపరిచారు. కార్యక్రమంలో డ్వాక్రా సంఘ సభ్యులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పాఠశాలల నిర్వహణకు నిధుల విడుదల

హిరమండలం: ప్రభుత్వ పాఠశాలల నిర్వహణ ఖర్చుల కింద మండలానికి రూ.30 లక్షలు మంజూరైనట్టు ఎంఈఓ రాంబాబు తెలిపారు. గురువారం కిట్టాలపాడు ప్రాథమికోన్నత పాఠశాలలో జరుగుతున్న నాడు–నేడు పనులను పరిశీలించారు. ఎంఈఓ మాట్లాడుతూ మండలంలోని 52 ప్రభుత్వ ఉన్నత పాఠశాలలకు ఈ మొత్తం మంజూరైనట్టు తెలిపారు. ఒక్కో పాఠశాలకు రూ.13 వేల నుంచి లక్ష రూపాయల వరకూ విడుదలైనట్టు తెలిపారు. నాడు–నేడు పెండింగ్ పనులు త్వరితగతిన పూర్తిచేయాలని పిలుపునిచ్చారు. నిధులు పుష్కలంగా ఉన్నందున జాప్యం చేయకుండా పనులు పూర్తి చేయాలన్నారు. విద్యాసంవత్సరం ప్రారంభం నాటికి పెండింగ్ పనులు పూర్తిచేయాలని ఆదేశించారు. నిబంధనలు పాటించకపోతే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆయన వెంట హెచ్‌ఎం, ఇతర ఉపాధ్యాయులు ఉన్నారు.

ఏం కష్టమొచ్చిందో..?

- ఎస్‌పీఎఫ్ కానిస్టేబుల్ ఆత్మహత్య
- ఇండియన్ ఓవర్‌సీస్ బ్యాంక్‌లో గార్డుగా విధులు
- బ్యాంకులోనే ఎస్ఎల్ఆర్‌తో కాల్చుకున్న శంకరరావు
- భర్త మృతదేహాన్ని చూసి భార్య కన్నీరుమున్నీరు
- ఆర్థిక వ్యవహారాలే కారణమై ఉండొచ్చని భావిస్తున్న పోలీసులు


రక్తపు మడుగులో కానిస్టేబుల్ శంకరరావు మృతదేహం

సీతమ్మధార: బంగారంలాంటి ఉద్యోగం.. సంతోషకరమైన కుటుంబం.. ఏం కష్టమొచ్చిందో.. తెల్లవారుజామున విధుల్లో ఉన్న స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్ కానిస్టేబుల్ సెల్ఫ్ లోడెడ్ రైఫిల్(ఎస్ఎల్ఆర్)ను గుండెకు గురి పెట్టుకుని కాల్చుకున్నాడు. క్షణాల్లోనే కుప్పకూలిపోయి ప్రాణాలు విడిచాడు. ఈ ఘటన మొత్తం బ్యాంక్‌లోని సీసీ కెమెరాల్లో రికార్డయ్యింది. కానిస్టేబుల్ ఆత్మహత్య దృశ్యాలు ప్రతి ఒక్కరి మనసును కలచివేశాయి. విధులు ముగించుకుని ఇంటికొస్తాడనుకున్న భర్త మరణవార్త తెలియడంతో భార్య గుండె పగిలిపోయింది. బ్యాంకులో రక్తపు మడుగులో విగత జీవిగా పడి ఉన్న భర్తను చూసి ఆమె కన్నీరుమున్నీరుగా విలపించింది. తల్లి ఎందుకు రోదిస్తుందో తెలియని వయసులో చిన్నారులు పడిన వేదనను చూసిన వారి హృదయాలు ద్రవించిపోయాయి. స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్ కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న పాలవలస శంకరరావు(37) విధి నిర్వహణలో ఎస్ఎల్ఆర్‌తో కాల్చుకుని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన పోలీస్ వర్గాల్లో సంచలనం రేపింది. వివరాలివీ..

విజయనగరం జిల్లా వంగర మండలం కొట్టిశ గ్రామానికి చెందిన పాలవలస శంకరరావు(37) భార్య శ్రావణి, కుమారుడు కిశోర్‌చంద్రదేవ్(6) కుమార్తె జ్ఞానవిత(3)తో కలసి మద్దిలపాలెంలో నివాసం ఉంటున్నారు. 2010 బ్యాచ్‌కు చెందిన శంకరరావు(3908) స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్ కానిస్టేబుల్‌గా పనిచేస్తున్నారు. ద్వారకానగర్‌లో జ్యోతి బుక్ డిపో గ్రౌండ్ ఫ్లోర్‌లోని ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్‌లో చెస్ట్‌గార్డ్‌గా విధులు నిర్వహిస్తున్నారు. గురువారం ఉదయం 5.55 గంటల సమయంలో తన వద్ద ఉన్న ఎస్ఎల్ఆర్ గన్‌తో గుండెపై గురి పెట్టుకుని ముందుకు వంగి కాల్చుకున్నాడు. ఈ శబ్దం విన్న తోటి ఉద్యోగులు వెంటనే వచ్చి చూసేసరికి శంకరరావు రక్తపు మడుగుల్లో పడి ఉన్నాడు. మృతి చెందినట్లు గుర్తించిన ఉద్యోగులు వెంటనే అధికారులు సమాచారం ఇచ్చారు. ద్వారకా ఏసీపీ రాంబాబు, సీఐ ఎస్.రమేష్, ఎస్ఐ ధర్మేంద్రతో పాటు స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్ అధికారులు హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. భార్యకు సమాచారం ఇవ్వడంతో ఆమె పిల్లలతో ఘటనా స్థలం వద్దకు చేరుకుని రక్తపు మడుగులో ఉన్న భర్త మృతదేహాన్ని చూసి కన్నీరుమున్నీరైంది. క్లూస్ టీం వేలి ముద్రలు సేకరించింది. సీఐ ఎస్.రమేష్ సీసీ ఫుటేజ్‌లను పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. ఈ ఘటనపై ఏసీపీ ఆధ్వర్యంలో సీఐ దర్యాప్తు చేస్తున్నారు. ఆత్మహత్యకు గల కారణాలపై అన్ని కోణాల్లో విచారిస్తున్నారు. అయితే ఆర్థిక వ్యవహారాలే ఆయన ఆత్మహత్య కారణమై ఉండొచ్చని పోలీసులు భావిస్తున్నారు. పోస్టుమార్టం అనంతరం కొట్టిశ గ్రామానికి ఆయన మృతదేహాన్ని తరలించారు.

‘హోమ్ ఓటింగ్‌పై దృష్టి పెట్టాలి’


సెక్టార్ ఆఫీసర్లతో మాట్లాడుతున్న ఆర్‌ఓ రామ్మోహనరావు

నరసన్నపేట: నియోజకవర్గంలో 80 ఏళ్లు దాటిన వారు 800 మంది వరకూ ఉన్నారని, వీరందరికీ ఇంటి వద్దే ఓటు వేసేందుకు ఎన్నికల కమిషన్ అవకాశం కల్పించిందని నరసన్నపేట ఆర్ఓ రామ్మోహనరావు అన్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో గురువారం సెక్టార్ ఆఫీసర్లతో సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ హోం ఓటింగ్‌పై అందరూ అవగాహన కలిగి ఉండాలని, ఎన్నికల కమిషన్ కల్పించిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. 80 ఏళ్లు దాటిన వారందరికీ 12–డీ ఫారాలు సరఫరా చేస్తామని, అయితే వారి ఆప్షన్ మేరకు వారు ఓటు ఇంటి వద్ద నుంచి గానీ లేదా పోలింగ్ కేంద్రానికి వచ్చి గానీ వేసుకోవచ్చన్నారు. దీన్ని సెక్టార్ ఆఫీసర్లు పరిశీలించి వారి అభిప్రాయాల మేరకు తగిన ఏర్పాట్లు చేయాలన్నారు. ప్రతి ఒక్కరూ తమ పరిధిలో ఉన్న 80 ఏళ్లు దాటిన ఓటర్లపై దృష్టి పెట్టాలని సూచించారు. సమావేశంలో తహసీల్దార్ కనకారావు, టీడీ రామారావు తదితరులు పాల్గొన్నారు.